క్లుప్తంగా

నిరుపేద కుటుంబానికి సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎర్రగుట్ట గ్రామానికి చెందిన సిడాం రాములు అనే నిరుపేద కుటుంబానికి ఆదివారం సామాజిక కార్యకర్త చాపిడే ప్రకాశ్, తోరే బాపురావులు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామస్తులు వసంత్, తిరుపతి, శంకరయ్య, సాంబయ్య తదితరులు ఉన్నారు.

కార్తీక్‌కు ఘన సన్మానం



కార్తీక్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కెరమెరి: ఎవరెస్టు శిఖరం అధిరోహించేందుకు ఇటీవల సిక్కిం రాష్ట్రంలో 22 రోజులపాటు మంచుకొండల్లో శిక్షణ పూర్తి చేసుకొని ఇంటికి చేరుకున్న మండలంలోని కెలికే గ్రామానికి చేరిన గిత్తే కార్తీక్‌ను మండల కేంద్రంలో ఆదివారం వంజారి సంఘ నాయకులు రవి గిత్తే, సంభా జాదవ్, శివాజి చోళే శాలువాతో ఘనంగా సన్మానించారు.

హరీశ్‌బాబుకు టికెట్.. కార్యకర్తల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ బీజేపీ టికెట్ ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ హరీశ్‌బాబుకు కేటాయించడంతో ఆదివారం పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక రాజీవ్ గాంధీ చౌక్‌లో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పాల్వాయి హరీశ్‌బాబు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కౌటాల: సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాల్వాయి హరీశ్‌బాబుకు పార్టీ టికెట్ కేటాయించడంతో బీజేపీ నాయకులు ఆదివారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో సంబరాలు చేసుకున్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం మాట్లాడుతూ బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమన్నారు. నాయకులు బండి రాజేందర్‌గౌడ్, భీమయ్య, తిరుపతి, విజయ్, రవి, మధుకర్, చందు, తిరుపతి, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌ను పార్టీ శ్రేణులు సన్మానించాయి. సిర్పూర్ బీజేపీ టికెట్ డాక్టర్ హరీశ్‌బాబుకు కేటాయించేందుకు సహకరించిన డాక్టర్ శ్రీనివాస్‌ను డాక్టర్ హరీశ్‌బాబు ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు.

మద్యం దుకాణం తనిఖీ



షాప్‌ను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఎస్సై అశోక్

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన జై హనుమాన్ వైన్స్‌ను ఆదివారం ఎక్సైజ్ శాఖ ఎస్సై అశోక్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మద్యం షాపు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నాన్ మెయింటనెన్స్ కేసు నమోదు చేశారు. రూ.10వేల జరిమానా కట్టాలని షాప్ యజమానికి సూచించారు. ఎస్సై మాట్లాడుతూ చట్టానికి విరుద్ధంగా కార్యకలాపాలకు పాల్పడే మద్యం షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'ఆదివాసీ నాయకులకే టికెట్ కేటాయించాలి'



మాట్లాడుతున్న సంఘం నాయకులు

జైనూర్: ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు మడావి గణపత్, నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి నగేశ్, అంకోశ్, సుభాశ్ తదితరులు ఉన్నారు.



దహెగాం: బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులు



కౌటాల: గుడ్లబోరిలో సద్దుల సందడి



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్‌లో..

ఘనంగా సద్దుల బతుకమ్మ



కౌటాల: బతుకమ్మతో చిన్నారి

జిల్లాలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి పూజలు చేశారు. ఆయా కాలనీల్లో, కూడళ్ల వద్ద పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపంలోని వాగులు, చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్, బాపూనగర్, బజార్‌వాడి, జన్కాపూర్, సందీప్‌నగర్, రాజంపేట, తారకరామానగర్‌లలో వేడుకలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. రెబ్బెన మండలం గోలేటిటౌన్‌షిప్‌లో బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

– దహెగాం/ కౌటాల /రెబ్బెన/ ఆసిఫాబాద్



దహెగాం: అమ్మవారి రూపంలో బతుకమ్మ



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని రావులవాడలో..



కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లో బతుకమ్మలతో మహిళలు



రెబ్బెన: బతుకమ్మతో చిన్నారులు



ఆసిఫాబాద్: బతుకమ్మలతో మహిళలు



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో..

నేడు దసరా వేడుకలు



ముస్తాబైన కేస్లాపూర్ హనుమాన్ ఆలయం

ఆసిఫాబాద్: జిల్లా వ్యాప్తంగా నేడు దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లాకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం వద్ద సోమవారం దసరా ఉత్సవాలు జరుపుకునేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శమీ వృక్ష పూజను సంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్నారు. విజయదశమి పుణ్యతిథి పురస్కరించుకొని బుధవారం ఉదయం పట్టణంలో సాయి ఉత్సవ విగ్రహంతో నగర సంకీర్తన, జోలి భిక్ష నిర్వహించనున్నట్లు అర్చకులు మధూకర శర్మ తెలిపారు.

5కే రన్ విజయవంతం



5కే రన్‌లో పాల్గొన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: ఫిట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ఆదివారం 5 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహించారు. 5కే రన్‌లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. స్వేరోస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్, చీఫ్ కన్వీనర్ దుర్గయ్య, స్వేరోస్ కోకన్వీనర్ కుమార్ పాల్గొన్నారు.

బంతిపూలకు తగ్గిన డిమాండ్



జిల్లాకేంద్రంలో వెలిసిన బంతిపూల దుకాణాలు

ఆసిఫాబాద్: సద్దుల బతుకమ్మ, దసరా పండగ పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఆదివారం కొనుగోలుదారులతో సందడిగా మారింది. సద్దుల బతుకమ్మ సందర్భంగా మార్కెట్‌లో బంతిపూలతో పాటు పండగ సామగ్రి దుకాణాలు వెలిశాయి. గతేడాదితో పోల్చితే ఈసారి బంతిపూలకు ధరలు బాగా తగ్గాయని విక్రయదారులు పేర్కొంటున్నారు. గతేడాది కిలో బంతి పూలను రూ.100లకు విక్రయించగా, ఈ ఏడాది రూ.50లకే విక్రయించారు.

చిరుద్యోగులకు వేతన వెతలు



హట్టిలో భోజనం వడ్డిస్తున్న వర్కర్లు (ఫైల్)

- ఎనిమిది నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందుల్లో గిరిజన ఆశ్రమ కాంట్రాక్టు వర్కర్లు
- 'పండుగకు పస్తులేనా..' అని ఆవేదన

జిల్లా వివరాలు	
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	46
దినసరి వర్కర్లు	66
పార్ట్ టైం వర్కర్లు	238
శానిటేషన్ వర్కర్లు	53

కెరమెరి(ఆసిఫాబాద్): వారందరూ చిరుద్యోగులు.. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం విధానంలో విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థులకు భోజనం అందించడం, పారిశుధ్య పనులు చేపట్టడంలో కీలకమైన వీరికి నెలల తరబడి వేతనాలు అందడం లేదు. ఫలితంగా పండుగ పూట కూడా పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఎనిమిది నెలలలుగా పెండింగ్..

జిల్లాలో 46 గిరిజన సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో దినసరి వర్కర్లు 66, పార్ట్‌టైం వర్కర్లు 238, శానిటేషన్ వర్కర్లు 53 మంది పనిచేస్తున్నారు. వీరికి ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వంట గదుల్లో గడుపుతున్నా వీరిపై కనికరం చూపడం లేదు. పండుగకు సైతం నిరాశే ఎదురు కావడంతో ఆందోళన చెందుతున్నారు.

పండుగ గడిచేదెలా..?

ఉద్యోగులకు వేతనం ఐదు, పది రోజులు ఆలస్యమైతేనే గగ్గోలు పెడతారు. అలాంటిది చిరుద్యోగులు వేతనాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వారికి అవి కూడా సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు రెట్టింపవుతున్నాయి. అధికారులు జీతాల చెల్లింపుల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు ఉండగా, ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు రాకపోవడంతోనే ఆలస్యమవుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో విజయదశమి పండుగను అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకొంటారు. అయితే జీతాలు అందకపోవడంతో ఆశ్రమ పాఠశాలల వర్కర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమీపంలోని జిల్లాలోని వర్కర్లకు రెండు, మూడు నెలల వేతనాలు ఇప్పటికే అందినట్లు తెలుస్తోంది. కుమురంభీం జిల్లాలో మాత్రం ఆలస్యం కావడంతో చేతిలో చిల్లీగవ్వ లేక పండుగ ఎలా జరుపుకోవడం అని వారు ప్రశ్నిస్తున్నారు.

త్వరలో చెల్లింపులు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్లకు ఇప్పటికే రెండు నెలల వేతనాలు చెల్లించాం. మిగిలిన నెలల వేతనాల కోసం ఎస్‌టీవోలో బిల్లులు జమ చేశాం. త్వరలోనే కాంట్రాక్టు, ఔట్‌సోరిస్సింగ్, పార్ట్‌టైం వర్కర్లకు వేతన చెల్లింపులు జరుపుతాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంతో జాప్యం జరిగింది.

– పి.రమాదేవి, ఐటీడీఏ డీడీ

ప్రతిపక్షాల మాటలను నమ్మొద్దు

నార్నూర్: ప్రతిపక్ష నాయకుల మాటలను ప్రజలు నమ్మవద్దని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆదివారం మండలంలోని దుప్పాపూర్‌లో కార్యకర్తలు, సర్పంచ్‌లు, పోలింగ్ బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. కోవ లక్ష్మి, గోడం నగేశ్‌తో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కుమురం భీం ఆశయ సాధనకు కృషి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

కెరమెరి: కుమురం భీం ఆశయ సాధనకు ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కుమురం భీం 122వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కుమురం భీం చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్ అనే నినాదంతో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన అమర వీరుడు భీం అందరికి ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో మొహర్లే రాంచందర్, లక్ష్మణ్, శ్రీను, హనుమంతుడు తదితరులు ఉన్నారు.

కోనప్ప నామినేషన్‌కు గ్రామస్తుల విరాళం



విరాళం అందజేస్తున్న ప్రజలు

కౌటాల(సిర్పూర్): మండలంలోని శీర్షా గ్రా మంలో ఆదివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కోనప్ప నామినేషన్ ఖర్చుల కోసం గ్రామస్తులు రూ.5,500 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో అవకాశం ఇస్తే సిర్పూర్ నియోజకవర్గాన్ని మ రింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. పలువురికి పార్టీ కండువ కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

అంబేద్కర్ చూపిన మార్గాన్ని అనుసరించాలి

వాంకిడి: బోధిసత్వుడు బాబాసాహెబ్ అంబేద్కర్ చూపించిన బౌద్ధ ధమ్మ మార్గాన్ని ప్రతీ ఒక్కరు అనుసరించాలని 'సత్య ధమ్మ' సంస్థాపకుడు గురు భూమన్న మహరాజ్ అన్నారు. ధమ్మ చక్ర పరివర్తన దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగపూర్‌లోని దీక్ష భూమిలో నిర్వహించే జాతరలో భాగంగా మంచిర్యాల నుంచి ఏడు రోజుల బైక్ యాత్రను చేపట్టారు. యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని ఖమాన గ్రామంలో బౌద్ధ సంఘ నాయకులతో కలిసి చలో నాగ్‌పూర్ జాతర గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బౌద్ధ ఉపాసకులు ఖోబ్రగడె కిషన్, జాడి టేమాజి, యశ్వంత్‌రావు, మారూతి, శంకర్, ఉప్రె వినేష్, తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న భూమన్న మహరాజ్

మాదిగల యుద్ధభేరి సభ పోస్టర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌టౌన్: నవంబర్ 5న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించ తలపెట్టిన మాదిగల యుద్ధభేరి సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుద్ధభేరి సభను జయప్రదం చేయడానికి ఈ ప్రాంతం నుంచి సంఘం బాధ్యులు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మెన ధర్మయ్య మాదిగ, మండల అధ్యక్షుడు ఎగురపు నగేశ్ మాదిగ, దూడల కుమార్ మాదిగ, బొమ్మల నరేశ్ మాదిగ, స్నేహత్ మాదిగ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు



కెరమెరి: మంగళహారతులిస్తున్న భక్తులు

కెరమెరి: మండల కేంద్రంలోని వివిధ వాడల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి ఏడోరోజు ఆదివారం మహా దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విద్యానగర్‌లో హోమం నిర్వహించారు. అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ ప్రత్యేక పూజలు చేయించారు.

కౌటాల: మండల కేంద్రంలోని శారదాదేవి విగ్రహం వద్ద భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు నిర్వహించిన దాండియా అందరిని ఆకట్టుకుంది.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. నవరాత్రుల్లో భాగంగా ఆలయంలో వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో సామూహిక విష్ణు, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ప్రతిరోజు నిర్వహించే వాహన సేవలో భాగంగా ఆదివారం రాత్రి ఏనుగు వాహనంపై ఊరేగించారు.

చెస్ పోటీల్లో ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు చెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు చెస్ అకాడమీ చైర్మన్ సుధాకర్, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఆదివారం తెలిపారు. కరీంనగర్‌లో ఈ నెల 17 నుంచి 21 వరకు నిర్వహించిన అంతర్జాతీయ ఆల్ ఇండియా చెస్ పోటీల్లో సీనియర్ విభాగంలో అర్జున్ అంతర్జాతీయ స్థాయి రేటింగ్ సాధించాడు. దుర్గం ప్రమీల ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. మోడల్ స్కూల్‌లో చదివిన విద్యార్థులు విజయాలు సాధించడంపై ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే పదో తరగతి చదువుతున్న దుర్గం విద్య అండర్ –15 విభాగంలో మొదటిస్థానంలో నిలిచి సత్తా చాటింది.